క్లుప్తంగా

సమస్యలపై అలసత్వం వహించొద్దు

రుద్రవరం: ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యలపై అలసత్వం వహించకుండా పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు హర్‌నాథరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.కొత్తగా వచ్చిన వారిరువురిని సిబ్బంది శాలువ, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగకుండా దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ పరంగా ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రేపు 'యోగా జ్యోతి' పుస్తకావిష్కరణ

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్‌బీఐ కాలనీ శ్రీరామాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం యోగా జ్యోతి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రచయిత యోగాచార్య నారాయణస్వామి శనివారం తెలిపారు. ప్రణవానంద గిరి గురుస్వాములు యోగా జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు.

వేంకటేశ్వర స్వామికి వెండి సమర్పణ

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి ఢీ.కొట్టాలకు చెందిన శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు శనివారం 250 గ్రాముల వెండిని సమర్పించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ స్వామి, అమ్మవార్లకు ఉదయాన్నే నిత్య పూజలు గావించారు. అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శనివారం కావడంతో స్థానికులే కాక వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

వైభవంగా చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ జంబులాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి బోనాల పండుగను పురస్కరించుకొని మొదటి రోజు శనివారం లోక కల్యాణం కోసం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే క్షీరాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు మాడుగుల నాగఫణి శర్మ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల సాయిరాంబాబా హాజరయ్యారు. పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులకు మాఘ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు చేరుకుని కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, అనంతయ్య, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో ఇటీవల అకారణంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. నాయకులు ఏసురత్నం, ప్రసాద్, రఫీ, మధు, సలాం మౌలానా, లక్ష్మణ్, రఫీ, నాగరాజు, తోటమద్దులు పాల్గొన్నారు.

కోటవీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

నంద్యాల(రూరల్): పట్టణంలోని కోటవీధి కాలనీలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ స్తంభంపై మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఏఈ నాగరాజు ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి వెళ్లి స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు. అనంతరం షార్ట్‌సర్క్యూట్ వల్ల దెబ్బతిన్న విద్యుత్ తీగలను తొలగించి, వాటి స్థానంలో నూతన తీగలు ఏర్పాటు చేశారు.

వినిపించని పల్లె అలారం

- గ్రామాల్లో కనుమరుగవుతున్న నాటుకోళ్లు
- గతంలో పాడితో పాటు కోళ్ల పెంపకం
- మారిన జీవనంతో పోషణకు దూరం

ఒకప్పటి పల్లె.. కోడి కూతతో నిద్రలేచేది. గడియారాలు లేని కాలంలో గ్రామీణులకు అదే అలారం. నాడు పల్లెలోని ఏ ఇంట్లో చూసినా పదుల సంఖ్యలో నాటుకోళ్లు కనిపించేవి. ఇంట్లో మనుషులతోపాటు కోళ్లు కూడా తిరిగేవి. నేడు పల్లెసీమల జీవన చిత్రం మారిన నేపథ్యంలో కోడి కూత వినిపించడమే గగనమైంది.



ఇంటి ఆవరణంలో కోళ్లు

నంద్యాల(అర్బన్): గతంలో..చీకటిపడుతుంటే ఎక్కడున్నా కష్టం మీద పట్టుకొచ్చి గంప కింద కప్పేసేవారు. తెల్లారుతుండగా బయటకు వదిలి గుడ్డు కోసం అత్రుతగా వెతికేవారు. సూర్యోదయానికి కొన్ని గంటల ముందే అందరిని నిద్రలేపేలా తొలికూతలు. పెట్ట కోసం పరుగులు పెట్టే పుంజులు, గుడ్లను పొదుగుతున్న కోడితో తన్నులాటలు.. దురదృష్టవశాత్తు ఇవన్నీ జ్ఞాపకాలుగా మిగిలే పరిస్థితులు నేడు నెలకొన్నాయి. జీవన విధానం మారడంతో పల్లెవాసులను నిద్రలేపే కోడి క్రమంగా ఊరికి దూరమవుతుంది.

గ్రామాల్లో కనిపించని నాటుకోళ్లు..

ఒకప్పుడు చిన్న గ్రామంలోనైనా 2వేల నుంచి 5వేల వరకు నాటుకోళ్లు ఉండేవి. జిల్లాలోని 411 గ్రామ పంచాయతీల్లో గతంలో 10 నుంచి 12లక్షల కోళ్లు ఉండగా ప్రస్తుతం 6లక్షల కోళ్లు మాత్రమే ఉన్నట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి. కోడి పుంజుల విషయం పక్కన పెడితే కోడి పెట్టలు కూడా కనిపించడం లేదు. నేడు నాటుకోళ్ల సంఖ్య భారీగా తగ్గిపోయింది. గతంలో పల్లెలోని ప్రతి ఇంటి ఆవరణలో నాటుకోళ్లు కనిపించేవి. నాటు గుడ్లను పొదిగే అలవాటు ఉండేది.పేద, మధ్యతరగతి ప్రజలు కుటుంబ అవసరాల నిమిత్తం 20 నుంచి 30 గుడ్లను పొదిగేవారు. వాటి నుంచి కోడిపిల్లలు రావడం, అవి పెరిగి పెద్దవ్వడం, బంధువులు వస్తే కోసి వండి వడ్డించేవారు. అయితే నేడు అవేవీ కనిపించడం లేదు. దాదాపు ఏ ఇంటిలోనూ కోడి జాడ కూడా కానరావడం లేదు.

నాటుకు అధిక డిమాండ్..

ప్రస్తుతం ఫారంకోళ్ల పెంపకంలో వివిధ రసాయనాలు వాడుతున్నారని ,కృతిమ పద్ధతిలో పెంచుతున్నారనే వార్తల నేపథ్యంలో నాటుకోడిని ప్రకృతి వరంగా భావిస్తున్నారు. సంక్రాంతి, దసరా పండుగలు వచ్చాయంటే ఇప్పటికీ నాటుకోడి, జొన్నరొట్టె, రాగి సంగటి కాంబినేషన్ ఉండాల్సిందే. నాడు గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన నాటుకోడి వంటకాలు పలు రూపాలను సంతరించుకొని ఇప్పుడు పట్టణాలు, నగరాల్లో మెనూలో ముందువరుసలో ఉంటున్నాయంటే వాటి ప్రాధాన్యతతను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కేజీ నాటుకోడి ధర రూ.600 పలుకుతోంది. అలాగే వాటి గుడ్లు డజన్ రూ.72 ప్రకారం విక్రయిస్తున్నారు.

ఇంటి నిండా కోళ్లు ఉండేవి



నా చిన్నప్పుడు మా ఇంటి నిండా నాటుకోళ్లు ఉండేవి. మా నాన్న వాటిని ప్రత్యేకంగా పెంచేవారు. గంపల కింద ఉంచేవాళ్లం. ఇప్పుడు నాకు నలుగురు కుమారులు వారు పెద్దవారు అయ్యాక మా ఇంట్లో ఒక్క కోడి కూడ లేదు. స్థలం సమస్య, ఇంటి పక్కల వారితో ఇబ్బందులు, తదితర కారణాలతో పూర్తిగా పెంచడమే మానేశాం.

– దూదేకుల హుసేనమ్మ, కానాల

కనుమరుగవుతున్న నాటుకోళ్లు



మా గ్రామంలో నాటుకోళ్లు, అధికంగా ఉండేవి. నేడు ఎవరూ వాటిని పెంచడం లేదు. నాటుకోడి మాంసం తినాలన్నా పట్టణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం పూట కోడి కూతలు వినిపించడం లేదు. నాటుకోడి బలమైన ఆహారం కూడా.

– సి.నికోదేవ్, లింగాపురం, కొత్తపల్లి మండలం

పోషక విలువలు అధికం



నాటు కోళ్లలో ఎక్కువ మాంసకృతులు లభిస్తాయి. నాటు కోడి గుడ్లు కూడా బలవర్ధకమైన ఆహారం. వీటిలో ఏ విటమిన్ పుష్కలంగా దొరుకుతుంది. కోళ్లకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయించాలి. –వెంకటసుబ్బారెడ్డి, ఏడీ జిల్లా పశువైద్యశాల

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

నంద్యాల(రూరల్): వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తనీయొద్దని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంఈపీ శెట్టి ప్రభాకర్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పుసులూరు గ్రామ సర్పంచ్ రాము, ఎంపీటీసీ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం వచ్చే ప్రజల నుంచి రెవెన్యూ అధికారులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ అధికారి యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యాలయంలో ఎవరూ డబ్బులు తీసుకోరని, ఒకవేళ ఎవరైనా డబ్బులు అడిగితే ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. మునగాల గ్రామంలో 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఉన్నప్పటికీ గృహ రుణాలు మంజూరు చేయడం సర్పంచ్ లోకేశ్వరరెడ్డి ప్రస్తావించారు. హౌసింగ్ ఏఈ వర్మ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థలాలు ఉన్న వారికి రుణాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు. విద్య, వైద్య, పశు వైద్య, ఆర్‌టీసీ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఉపాధి, వెలుగు తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కో ఆప్షన్ సభ్యుడు బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నంద్యాల(అర్బన్): బనగానపల్లె పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనపై నిజాలు నిగ్గు తేల్చకుండా ఎస్ఐ శంకర్‌పై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని, సస్పెన్షన్‌కు కారణమైన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జీపీఎస్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. ఎస్ఐ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలంటూ శనివారం గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఎస్పీ కార్యాలయ సీసీ ఫయాజ్‌కు వినతి పత్రం అందజేశారు.

పేదలకు త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీ

- మొదటి విడతలో 2,900 మందికి అందజేత
- ఎమ్మెల్యే శిల్పా రవి



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: పట్టణంలోని పేదలకు ఇళ్ల పట్టాలు అందించకుండా ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని చట్టపరంగా అధిగమించి పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఎస్సార్బీసీ, కర్నూలు మార్గంలో గుర్తించిన ఇళ్ల స్థలాలను ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు దాదాపు 5వేల మంది అర్హులను గుర్తించామన్నారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లి పిటీషన్లు వేయడంతో పంపిణీ నిలిచిపోయిందన్నారు. మూడు కేసులకు గాను ఓ కేసులో లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, దీంతో మొదటి విడతలో 2,900 మందికి త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని, రెండో దశలో మిగిలిన వారికి ప్లాట్లను సిద్ధం చేసి అందిస్తామని చెప్పారు. వేల మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోతారని టీడీపీ నాయకులు మధ్యవర్తుల ద్వారా కేసులు వేయించి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా వారికి ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తామని ప్రకటించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ముందుకురండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శైలజ

ఆళ్లగడ్డ: బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలో అన్ని వ్యవస్థలు, వర్గాలు ముందుకు రావాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి శైలజ కోరారు. స్థానిక కోర్టులో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, ఐసీడీఎస్ అధికారులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని, 18 ఏళ్లు నిండిన యువతులకు మాత్రమే వివాహం జరిపించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా చేస్తే జైలు శిక్షలు, జరిమానా తప్పవని స్పష్టం చేశారు.

నంద్యాల(సిటీ): బాల్య వివాహాలు నేరమని, వాటి ద్వారా అనర్థాలు జరుగుతాయని ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. అయ్యలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలను అంతం చేద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో మాతాశిశు మరణాలు సంభవిస్తాయని, పిల్లల్లో శారీరక, మానసిక వికలాంగత్వం ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించండి



యర్రగుంట్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

శిరివెళ్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలని హౌసింగ్ పీడీ శేషుబాబు తెలిపారు. శనివారం యర్రగుంట్లలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని పీడీ తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని కాలనీలున్నాయి, ఎంత మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మొదలు పెట్టారని పీడీ ఏఈ అహమ్మద్‌బాషాను ఆరా తీశారు. మండలంలో 6 గ్రామాల్లో జగనన్న కాలనీలు ఉన్నాయని, 1,025 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని ఏఈ చెప్పారు. 322 ఇళ్లు పునాది వరకు వచ్చాయని వివరించారు. పీడీ మాట్లాడుతూ లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. మార్చిలోపు గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని చెప్పారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రాచారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి చెందిన తిరుపతి వెంకటపతి (39) అనే వ్యక్తి ఇంట్లో వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మూడు రోజులు క్రితం గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఓబుళమ్మ, కుమారుడు ఉన్నారు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

'సుకన్య' పథకాన్ని వినియోగించుకోండి

నంద్యాల(వ్యవసాయం): ఆడపిల్లల తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక నూనెపల్లెలోని నవభారత్ పబ్లిక్ స్కూల్ లో పోస్టల్ శాఖ సిబ్బందితో బాలికలు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ సిబ్బంది రామ్మోహన్, శ్రీనివాసరెడ్డి, వేణు, విజయానంద్ పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



మరియమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం పెద్ద బోదనం గ్రామానికి చెందిన వలంటీర్ దోని సుధీర్ తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాయచోటి మరియమ్మ అనే వృద్ధురాలికి శనివారం పింఛన్ అందజేశాడు. మరియమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సుధీర్ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అప్పగించాడు.

లోక కల్యాణం కోసం హోమాలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవ నగర్ రామాలయంలో శనివారం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే వేంకటేశ్వర స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శ్రీవినాయక, ధన్వంతరి, సుదర్శన హోమాలు నిర్వహించి పుణ్యాహుతి గావించారు. కార్యక్రమంలో వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం ప్రధానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడమే ప్రధానమని తిరుపతి పద్మావతి హృదయాలయాల ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనాథరెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఉదయానంద ఆసుపత్రిలో నంద్యాల శాఖ ఐఎంఏ మహిళా విభాగం, మిషన్ పింక్ హెల్త్ విభాగం, రోటరీ క్లబ్ సంయుక్త నిర్వహణలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీనాథరెడ్డి హాజరై మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందన్నారు. క్యాన్సర్ వ్యాధి శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. కీమో థెరపీ, రేడియో థెరపీ, శస్త్ర చికిత్సల రూపంలో వైద్యం అందిస్తారన్నారు. ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధిని గుర్తించడానికి అత్యంత ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మంచి అలవాట్లు, సరైన ఆహార విధానం, క్రమం తప్పని వ్యాయామం, క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలు చేర్చినందువల్ల పేద ప్రజలు ఉచితంగా చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్లు మురళీధర్, ప్రణీత, చంద్రశేఖర్, జఫరుల్లా, వసుధ, లక్ష్మిసౌజన్య, నాగమణి, రామేశ్వరరెడ్డి, గీతావాణి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలితో క్యాన్సర్ దూరం

నంద్యాల(అర్బన్): ఆరోగ్యకరమైన జీవితంతో క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి తెలిపారు. కళాశాలలో శనివారం వరల్డ్ క్యాన్సర్స్ డేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అపోహలకు పోకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా పొగాకు దూరంగా ఉండటం, తగినంత శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, మద్యపానాన్ని పరిమితం చేయడం వంటి వాటితో క్యాన్సర్‌ను దరి చేరకుండా చేసుకోవచ్చన్నారు. వంశపారంపర్యంగా క్యాన్సర్ వస్తుందని భావించడం తప్పని, ప్రస్తుతం క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్సలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ విభాగం సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్



శిరివెళ్లలోని జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించిన దృశ్యం

శిరివెళ్ల: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. సొంత స్థలాలు లేని వారికి స్థలాల పంపిణీ చేసి వారికి ఇళ్లు మంజూరు చేసింది. మండలంలో 2,817 మందికి పక్కా గృహాలు మంజూరు చేసింది. మొదటి విడత కింద శిరివెళ్ల, యర్రగుంట్ల, బోయలకుంట్ల, పచ్చర్ల, మోత్కలపల్లె, గంగవరంలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం గతేడాది శ్రీకారం చుట్టింది. అందులో ఇప్పటికి వరకు 1,097 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మొదలు పెట్టారు. ఇందులో 437 ఇళ్లు పూర్తికాగా మరో 686 ఇళ్లు పునాది స్థాయిలో ఉన్నాయి. జగనన్న కాలనీలో అధికారులు తాగునీరు, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. మండల కేంద్రంలోని కాలనీలో 2,500 లీటర్ల సామర్థ్యం గల 3 నీటి తొట్లు నిర్మించారు. అలాగే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు లాగారు. యర్రగుంట్ల కాలనీలో 4 నీటి తొట్లు, విద్యుత్ సదుపాయం, చెన్నూరులో ఒకటి, గంగవరంలో 4, మోత్కలపల్లెలో 1, గోవిందపల్లెలో 4 నీటి తొట్లు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషా మాట్లాడుతూ కాలనీలలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో అంతర్గత సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాల బట్టి లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తున్నామని వివరించారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

శిరివెళ్ల: మండలంలో జరిగిన ఈ- క్రాప్ నమోదును జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు శనివారం పరిశీలించారు. వెంకటాపురంలో వరి సాగును పరిశీలించి సాగుచేసిన రైతు పట్టాదారు పాస్ పుస్తకాన్ని పరిశీలించారు. మండలంలో 5,500 ఎకరాల్లో వరి పంట సాగైందని, ప్రస్తుతం ఈ- క్రాప్ జరుగుతుందని ఏఓ సుధాకర్ తెలిపారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి ఎరువుల సరఫరా రికార్డులను పరిశీలించారు. రైతుల డిమాండ్ మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఈ -క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ : రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 20వ తేదీలోపు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ శనివారం తెలిపారు. మండలంలో రబీలో ప్రధానంగా పప్పుశనగ, మినుము, జొన్న, వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేశారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులతో రైతులు తమ పంట వివరాలను తెలియజేసి నిర్ణీత సమయంలో నమోదు చేయించుకోవాలని ఏఓ కోరారు.



వెంకటాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ